నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, మంగళవారం 2 ఏప్రిల్ 2024 SIDDIPET

# సైబర్ బాధితులు ఫిర్యాదు చేయాలి

## డయల్ 1930, సైబర్ క్రైం వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు: సీపీ



సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 1: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో 2023 ఆగస్టులో సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభించామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో రూ.లక్ష వరకు పోగొట్టుకున్న బాధితులు మంగళవారం నుంచి 1930 నెంబర్‌కు కాల్ చేయడం, https://cybercrime.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడం లేదా పోలీస్ కమిషనరేట్‌లోని రెండోఫ్లోర్‌లో ఉన్న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నేరుగా దరఖాస్తు చేస్తే కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభిస్తామని తెలిపారు. రూ.1 నుంచి రూ.99,999 వరకు సైబర్ నేరాల్లో డబ్బులు పోగొట్టుకున్న బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చని సీపీ తెలిపారు.

# పోలింగ్ విధులు తెలుసుకోవాలి: కలెక్టర్



సిద్దిపేటలో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 1: పోలింగ్ విధులను తెలుసుకోవాలని సిద్దిపేట కల్టెకర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట నియోజకవర్గ ఎన్నికల ప్రొసిడింగ్, అసిస్టెంట్ ప్రొసిడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, నిర్వహణపై సోమవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల నియమావళి ప్రకారమే జరగాలన్నారు. అవసరమైతే ఈవీఎంల మార్పు, ఈవీఎంల పనితీరుపై పీవో, ఏపీవో, వోపీవోలు తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, మాస్టర్ ట్రైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రైతుల పడిగాపులు

## పదిరోజులుగా నిలిచిన పొద్దుతిరుగుడు కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాలు పునః ప్రారంభించాలంటున్న బీఆర్ఎస్
- మార్కెట్‌లో అవస్థలు పడుతున్న అన్నదాతలు
- తక్షణమే కొనుగోలు చేయాలని రైతుల విజ్ఞప్తి



సిద్దిపేట మార్కెట్ యార్డులో ధాన్యం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 1: పొద్దుతిరుగుడు కొనుగోలు కోటా విడుదల చేయకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే కోటా విడుదల చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ వంగ నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు రైతుల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం పొద్దుతిరుగుడు పంటను కేంద్ర ప్రభుత్వ కోటాలో కొనుగోలు చేసి, కోటా పూర్తి కావడంతో కొనుగోళ్లు నిలిపి వేశారన్నారు. పదిరోజులుగా పొద్దు తిరుగుడు రైతులు మార్కెట్ యార్డులోనే ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పొద్దుతిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. పది రోజులుగా ఇక్కడే ఉండి కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నామని పొద్దుతిరుగుడు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

**నిలిచిన కొనుగోళ్లు..**

సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లు నిలిచిపోయి దాదాపు పదిరోజులవుతుంది. ఒక్కొక్క రైతు పంట కోసి నెలరోజులు కావస్తుంది. కేంద్ర ప్రభుత్వం కోటా పూర్తయిందని కొనుగోళ్లు నిలిపివేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కోటా విడుదల చేయకుండా జాప్యం చేయడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. పది రోజులగా కొనుగోలు కేంద్రం వద్దనే పడిగాపులుకాస్తూ రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు జిల్లాలోని అనేక మంది రైతులు సిద్దిపేట మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటే కేవలం రూ.3,500 నుంచి రూ.4 వేలు మాత్రమే చెల్లించే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.



సిద్దిపేట మార్కెట్ యార్డులో రైతులకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

### రైతులను ఇబ్బందులు పెట్టకుండ్రి..



బీఆర్ఎస్ ప్రభుత్వం ఎట్ల కొన్నదో.. ఇప్పుడూ అట్ల కొనాలె. ఎందుకు మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నరు. ఎనకట కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలాంటి రోజులు ఉండెనో మళ్లీ అలాంటి రోజులు వచ్చినయి. మొన్నటి దాకా కేసీఆర్ ప్రభుత్వంలో మంచి గుండె. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మమ్మల్ని కేసీఆర్ చూసుకున్నడు. మల్లన్నసాగర్ నీళ్లు ఇచ్చిండు, మంచిగ కరెంట్ ఇచ్చిండు. మళ్ల ఇప్పుడు బాధలు పడుతున్నం. సాగు నీళ్లు లేవు, కరెంట్ ఎప్పుడస్తదో తెల్వదు. దయచేసి మమ్మల్ని ఇబ్బందులు పెట్టకుండా పొద్దుతిరుగుడు ధాన్యం కొనాలె.

– ఎం.రాజనర్సు (వీరారెడ్డిపల్లి, అక్బర్‌పేట భూంపల్లి మండలం)

### బీఆర్ఎస్ ప్రభుత్వం మంచిగ కొన్నది..



మాది మల్యాల గ్రామం. ఎప్పుడు మాకు ఇట్ల కాలేదు. ఐదారేండ్ల సంది బీఆర్ఎస్ ప్రభుత్వం పొద్దుతిరుగుడు పంట మంచిగ కొన్నది. పొద్దు తిరుగుడు పంట కోసి నెల అయితుంది. ఇప్పుడు మేము బీట్‌కు తీసుకొచ్చి పది రోజులైతాంది. ఎందుకు ఇట్ల ఇబ్బంది పెడుతున్నరో అర్థమైత లేదు. దయచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టకుంట పంట కొనుగోలు చేయాలె.

– మమత (మల్యాల, నారాయణరావుపేట మండలం)

## ఆదరించండి..

# సేవకుడిగా పనిచేస్తా..

## గెలిచిన 30 రోజుల్లో రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు

## నిత్యం అందుబాటులో ఉంటా: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పక్కన సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్, వేదికపై బీఆర్ఎస్ నాయకులు

- మెదక్ ఎంపీని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు భూటకమన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలందరూ రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మీరు చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. అదే తరహాలో వచ్చే ఎంపీ ఎన్నికల్లో కూడా మరింత ఉత్సాహంతో పని చేసి మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని ఆదరించి, భారీ మెజార్టీతో గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తారని చెప్పారు. మెదక్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకొని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు.

**గాలి మాటలు మాట్లాడను: వెంకట్రామిరెడ్డి**

గెలిచిన నెలరోజుల్లో రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తానని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, పేదలు ఉచితంగా పెండ్లీలు చేసుకునేందుకు ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తానన్నారు. 40 రోజులు నావెంట నడిస్తే జీవితకాలం మీ వెంటే ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, కేవలం 2శాతం ఓట్లతో అధికారం కోల్పోయామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల సహకారంతో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌దేనన్నారు. గెలుపోటములు సహజమని, కార్యకర్తలు కుంగిపోకుండా ముందుకు సాగి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు సమస్యలు, రైతుల సాగునీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. సంగారెడ్డిలో తనకు అణువణువు తెలుసని, ఎంపీగా గెలిస్తే పరిపాలన అనుభవతంతో ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. వేలాది కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంలో ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు కోచింగ్, యువతకు వృత్తి నైపుణ్యం కోర్సుల ఏర్పాటు చేస్తానన్నారు. యువతకు శిక్షణ అందించి జాబ్ మేళా ద్వారా ఉపాధి అవకాశం కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరాం చందర్, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు దేస్‌పాండే, పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకం విఠల్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు మల్లాగౌడ్, నగేశ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

# కేంద్రం నిధులు విడుదల చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



శనిగరం ప్రాజెక్టును సందర్శించి రైతులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో కరువు పరిస్థితుల దృష్ట్యా రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సోమవారం కోహెడ మండలంలోని శనిగరంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. శనిగరం ప్రాజెక్టును సందర్శించి రైతులతో మాట్లాడారు. చెంచల్‌చెర్వుపల్లిలో సీతారామచంద్రస్వామి ఆలయం నవగ్రహ, ధ్వజ శిఖర యంత్ర ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరయ్యారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులు తెచ్చి రైతులను ఆదుకోవాల్సిన బండిసంజయ్ కల్లాల్లో పండుకుంటాననడం హాస్యాస్పదమన్నారు. కల్లాల్లో కాకుండా ఢిల్లీలో పండుకొని కరువు నిధులు తేవాలన్నారు. నష్టపోయిన పంటలకు కేంద్ర ప్రభుత్వం ఎంత పరిహారం ఇస్తే అంతకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆరు గ్యారెంటీలపై విమర్శలు చేస్తున్న బండిసంజయ్ విభజన హామీలు, రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. వర్షాలు పడక కరువు పరిస్థితులు వచ్చాయన్నారు. సాగు, తాగునీటి వినియోగంపై ప్రభు త్వం సమీక్షలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో పథకాలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

కోహీర్, ఏప్రిల్ 1: ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరవేసేందుకు త్వరలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాలులో డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలతోనే ప్రభుత్వ పథకాలు అందజేస్తామని చెప్పారు. కార్యకర్తలు కూడా నాయకులుగా ఎదగాలని, పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలను ఉన్నతస్థితికి తీసుకువస్తామని చెప్పారు. ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ గెలుపు కోసం కార్యకర్తలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, మాజీమంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

# యువత చూపు ఎటో!

## మెదక్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 18,19,397 మంది

- సగానికిపైగా ఓటర్లు 40 ఏండ్లలోపు వారే..
- మహిళలు, యువ ఓటర్లపైనే అభ్యర్థుల అంచనాలు
- నియోజకవర్గాల్లో జోరుగా పార్టీల ప్రచారం
- అభ్యర్థి భవితవ్యం యువ ఓటర్లపైనే..



మెదక్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో మొత్తం 18,19,397 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 40 ఏండ్లలోపు వారు 5,02,897 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో 9,21,400 మహిళా ఓటర్లు ఉండడం, ఆమె తీర్పుతో పాటు 40 ఏండ్లలోపు వారి ఓట్లే కీలకంగా మారనున్నాయి. అయితే ఏ వయస్సువారు ఏ పార్టీకి ఓటు వేస్తారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ సరళి ఎలా ఉంటుంది.. ఏ పార్టీకి లాభం ఎవరికి నష్టం అనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ పరిధి ఓటరు జాబితా ప్రకారం సగంమంది 40 ఏండ్లలోపువారే. 19 ఏండ్ల వయస్సు ఓటర్లు 53,458 మంది, 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు 3,96,228 మంది, 40 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు 5,02,897 మంది. నాలుగు పదుల వయస్సు దాటనివారు మొత్తం 9.53 లక్షల మంది ఉన్నారు. అంటే మొత్తం ఓటర్లలో సగం మంది ఓటర్లు ఈ వయస్సువారే కావడం గమనార్హం. అదేవిధంగా ఓటు వేసేవారు కూడా ఈ వయస్సు వారే ఎక్కువగా ఉంటారు. అభ్యర్థి గెలుపోటములపై వీరి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

**ప్రధాన పార్టీల్లో ఆశలు...**

మెదక్ పార్లమెంట్ పరిధిలోని మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, దుబ్బాక, గజ్వేల్, పటాన్‌చెరు, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న యువ, యువజన ఓటర్లు తమకే ఓటు వేస్తారని ప్రధాన రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అంచనాలు వేసుకుంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. అదేఊపుతో ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్‌కే ఓటు వేస్తారని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### గెలుపుపై ఎవరి ధీమా వారిదే....

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు అధిక సీట్లు రాకపోవడంతో అధికారం చేజారిపోయింది. కానీ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరు అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానం మాత్రమే కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఈసారి బీఆర్ఎస్‌కే ఓటు వేస్తారనే నమ్మకం ఉందని గులాబీ నాయకులు అంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన పనులు, తీసుకున్న నిర్ణయాలపై యువత, మధ్య వయస్సు ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటర్లు చేసిన తప్పులను సరిచేసుకొనే ప్రయత్నంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఉంది. అధికారంలో ఉన్నామని తమకే ఓటర్లు పట్టం కడతారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

**మెదక్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలు**

| | | |
|---|---|---|
| మొత్తం ఓటర్లు | : | 18,19,397 |
| పురుషులు | : | 8,97,788 |
| మహిళలు | : | 9,21,400 |
| ఇతరులు | : | 209 |

**వయసుల వారీగా ఓటర్ల వివరాలు**

| వయస్సు | ఓటర్లు |
|---|---|
| 18-19 | 53,458 |
| 20-29 | 3,96,228 |
| 30-39 | 5,02,897 |
| 40-49 | 3,87,303 |
| 50-59 | 2,43,498 |
| 60-69 | 1,45,855 |
| 70-79 | 72,336 |
| 80-89 | 15,640 |
| 90-99 | 2069 |
| 100-109 | 109 |
| 110-119 | 1 |
| 120 | 3 |

# రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం

## ఎకరాకు ప్రభుత్వం రూ.30లక్షల పరిహారం ఇవ్వాలి


- ట్రిబుల్ ఆర్ కోసం బలవంతంగా భూసేకరణ చేపట్టొద్దు
- రైతులను సమన్వయం చేసుకొని భూసేకరణ చేయాలి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 1: రీజినల్ రింగ్‌రోడ్డు(ఆర్ఆర్ఆర్) కోసం చేపట్టే భూసేకరణలో రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారికి అండగా ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరహార దీక్ష చేపడుతామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రిబుల్ ఆర్ బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని, పరిహారం విషయంలో న్యాయమైన ప్రకటన వచ్చే వరకు ఎవరూ సంతకాలు చేయవద్దన్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ఎకరాకు రూ.కోటి ఉందని, అందుకు ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.30లక్షల పరిహారంతో పాటు 250 గజాల ఇంటి ప్లాట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకరవర్గంలోని 17 రెవెన్యూ గ్రామాల రైతులకు గజ్వేల్ పట్టణంలోనే భూసేకరణ చేసి 250 గజాల ఇంటి ప్లాట్‌ను ఇవ్వాలన్నారు. భూసేకరణ సమయంలో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేయకుండా వారిని ఒప్పించి భూములు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్మాణాల కోసం భూసేకరణ చేపడితే రైతులకు న్యాయం చేయాలని పోరాడానన్నారు. బీఆర్ఎస్ తరపున ప్రతి రైతుకూ భరోసా కల్పిస్తామని, తగిన పరిహారం వచ్చేవరకు అండగా ఉంటామన్నారు. పోలీసుల పహారాలో భూసేకరణ చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పరిహారంతోపాటు ఇండ్లు, ప్యాకేజీలు, ఓపెన్ ప్లాట్లు ఇచ్చిందన్నారు. అదే తరహాలో రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, కౌన్సిలర్లు మెట్టయ్య, చందు, శ్రీనివాస్, నాయకులు విరాసత్ అలీ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, స్వామిచారి, అహ్మద్ ఉన్నారు.

### నేడు గజ్వేల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం




గజ్వేల్ పట్టణంలోని శోభ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగే సమావేశానికి మాజీమంత్రి హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలతోపాటు ముఖ్యులు హాజరవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.